# దృక్పథాలు

వేములపల్లి మోహనరావు
పి.వి. కృష్ణారావు




'అమ్మా....మీకు ఫోను...." మెట్లకింద నుంచీ వాచ్‌మన్ కేక. (దిగు....కింద రఘు నీకోసం .... క్షణాల్లో సంవత్సరాల్ని చెరిపి, నిన్ను నువ్వు అసహ్యించుకునే పరిస్థితుల్లో వదిలి, ఫ్లారిడా వెళ్ళే ముందు అతను నీకు చెప్పదల్చుకున్న తుదివలుకులు విను. నీ ఉనికి నిన్ను వెర్రిగా ప్రశ్నిస్తున్న ఈ పరీక్షాసమయంలో.... నీ చైతన్యం పరిష్కరించుకోలేని సమస్యను నీకు సృష్టించి .... ఇప్పుడు కర్టెసీ కాల్.... ఆన్సర్ హిమ్.)

'కస్తూరీ హియర్.'

(నిజంగా కస్తూరివేనా ! నీకు నువ్వే పరాయిగా, కొత్తగా అన్పించడంలేదూ.)

'హలో....చక్రవర్తిని కస్తూరీ.'

'నువ్వా....రఘు అనుకున్నాను.'

(ఇది రిలీఫా, డిజప్పాయింట్‌మెంటా!)

'నీతో మాట్లాడాలి అర్జెంటుగా.'

'ఏమిటి ?'

(అస్థిత్వమే ఆవిరైపోతున్న ఈ క్షణాల్లో మాట్లాడగలిగేదేముంది.నీ ఛాయిస్ ఎంత పొరపాటు!)

'నే నిప్పుడే రఘు దగ్గర్నుంచే వస్తున్నా. తన ప్రయాణం విషయం నీకు తెలియదని.... హలో....'

(అవును.... తెలియదు.... తెలిస్తేమాత్రం ....ఏమో తెలీదు).

'హలో .... యస్ చక్రీ .... వింటున్నాను చెప్పు.'

'అయామ్ రియల్లీ వెరీసారీ కస్తూరీ ఆ బ్రూట్ ఫ్లారిడా కాదు వెళ్ళాల్సింది క్రిమెటోరియంకి. నువ్వెందుకు ఊరుకున్నావు? షల్ ఐ స్టాప్ హిమ్ ?'

'నో.... వాట్ ఫర్.... లీవ్ హిమ్ ఎలోన్.'

'ఎలా ఉన్నావ్ కస్తూరీ.... హాస్టల్‌కి

ఒక మనిషి గొప్పతనం అతని హృదయంలో ఉంటుంది మస్తిష్కంలో లేదా బుద్ధిలో వుండదు. (మహాత్మాగాంధీ)




రానా నేను. నువ్వు నాతో బయటికి రాగలవా.... మాట్లాడాలి.... గెట్ రెడీ .... పదిహేను నిమిషాల్లో అక్కడుంటాను.'

క్లిక్‌మంది ఫోను.

(వాస్తవం జారుడుబండై ఈగో స్లిడ్ అవుతుంటే నిన్ను నువ్వు ఎలా రక్షించుకుంటావ్ ఈ విషమఘడియల్లో. ముందు నుంచీ నిన్ను డిచ్‌చేస్తూ నేఉన్నా తెలుసుకోలేకపోయావు. ఎంత గర్వంగా అర్పించుకున్నావు ముందూ ఆత్మనీ తర్వాత శరీరాన్నీ.... కెన్ యూ అన్‌డూ కెన్ యూ .కెన్ యూ.... అన్‌డూ.... అన్‌డూ.... అన్‌డూ ... )

రెండు నెలల క్రితం అరకువేలీలో ఒకరాత్రి ఫలితం నీ గర్భకోశపు మెలికల్లో ప్రాణికదలికలు. ఫీల్ ఇట్. నీలో పెరిగే ప్రాణాన్ని....విను. అంటోజనీ ఆరంభంలో చైతన్యపు అలజడిని,పుట్టుక కోసం నీ కడుపులో జరిగే ఆర్భాటాన్ని .... కెన్ యూ ది పేన్ ... పేన్ .... పేన్....)

• • •

'ఏం.... ఆపేశావేం....'

'ఏం లాభం .... ఎంత స్పీడ్‌గా వెళ్ళినా, నాకారు వేగం నీ ఆలోచనల వేగాన్ని జయించలేకపోయింది. అందుకే ఆపేశాను.'

( నా ప్రేమ, అభిమానం, ఆప్యాయత నీ మనసును గెలవలేకపోయాయి కదూ. అలాగే ఇది కూడా.)

'అయామ్ నాట్ అప్‌సెట్ చక్రీ.'

'ఐ విష్ యూ ఆర్....నీ నిశ్శబ్దాన్ని భరించడం కంటే, నీ విక్షిప్తతని భరించడం కంటే అదే మెరుగు.'

"చాలా కన్‌ఫ్యూజ్డ్‌గా ఉన్నాను. నేనెవరో నాకు తెలీడంలేదు."

'విషాదం నీ చైతన్యాన్ని జడత్వంగా మారుస్తోంది.. మాట్లాడు ఏదైనా సరే'

( టాక్ సమ్‌థింగ్ కస్తూరీ ... నేను నిన్నెంతగానో కావాలనుకుంటున్నానే. నీ సాన్నిధ్యంలో యుగాలైనా క్షణాల్లో గడిపేయడానికి సిద్ధంగా ఉన్నానే .... రెసిప్రొకేట్ చెయ్యలేవా .... ఓ చిన్న మాటైనా చెప్పలేవా....కనీసం....నువ్వు మంచివాడివి చక్రీ అనైనా....)

'మాటలు రావడంలేదు. ఇన్నాళ్ళ నా ప్రేమా, ఆరాధనా నా భ్రమల్లోంచి జనించాయని తెలుసుకుని, ఆ నిజాన్ని మింగలేక మూగవోయాను'.

'నీకు తెలుసా అతని మరదలు స్టేట్స్‌లో ఉందనీ, ఆమెని పెళ్ళాడి అక్కడే సెటిల్ అయిపోతాడనీ.'

(నీదారి నువ్వే వెదుక్కోవాలి కస్తూరీ.. ఆ దారి నేనే కాకూడదా ఆహ్వానిస్తున్న నా ఈ చేతిని అందుకో. ప్రేమతో స్పందించే నా నరాల సవ్వడి విను.... కమాన్ .... తిరస్కరించకు.)

'ఈరోజే తెలిసింది'.

'తెలిసే ఊరుకున్నావా?'

'ఏం చెయ్యమన్నావు?'

'ఏమిటా.....వాణ్ణి.....దట్ సనాఫే బిచ్....'

'వెయిటే మినిట్. స్పేర్ దట్ వర్డ్. ఆరునెలల తర్వాత నాకు పుట్టబోయే ప్రాణికి లోకంపెట్టబోయే పేరు అదే.'

'కస్తూరీ....'

(నిజమే చెబుతున్నావా !.... నువ్వు కాలుజారడమా ........ నేను నమ్మను. నన్ను అవాయిడ్ చెయ్యడం కోసం అబద్ధం చెబుతున్నావు.)


'అవును చక్రీ .... నేను నెం తప్పాను.'

'నేను వెళ్ళి రఘుని తీసుకొస్తాను. మనం పరిష్కారం వెతకాలి. అతని ఫ్లైట్ కింకా టైముంది.'

'వద్దు .. కొన్ని సమస్యలకి పరిష్కారాలుండవు. అతన్ని పెళ్ళాడటానికి నేను సిద్ధంగాలేను. అంతగా నన్ను వంచించిన మనిషితో జీవితాన్ని పంచుకోలేను.'

'నీకు ఇంత కష్టం కలగడాన్ని నేను భరించలేను కస్తూరీ.'

'నీకు గుర్తుందా ! మనమంతా రీసెర్చిలో చేరి ఒక ఏడాది అయిపోయిన తర్వాత నువ్వు నన్ను ప్రేమిస్తున్నానని అన్నప్పుడు నేనేమన్నానో.. నువ్వంటే నాకు చాలా ఇష్టం అనీ....అయితే ఆ ఇష్టంతోబాటు సెక్సువల్ పాషన్‌లేదనీ, రఘు అంటే రెండూ ఉన్నాయనీ....'



'అవును.. కానీ అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ నువ్వు నా కొక్కడివే.'

(నువ్వు ఊఅను కస్తూరీ. నా అభీష్టానికి అనుకూలంగా అప్పుడు నీ జీవితంలోనుంచి పక్కకు తప్పుకున్నాను. ఇప్పుడు నీ బ్రతుకు విచ్ఛిన్నమైపోతున్న ఈ సమయంలో నన్ను కాదనకు.)

'కానీ నేనుమాత్రం మారిపోయాను. మనసునూ, శరీరాన్నీ వేరెవరికో అర్పించుకున్నాను.'

'నీ భవిష్యత్తు గురించి నువ్వాలోచించాలి.'

'ముందు నన్నీషాక్‌నుంచి తెరుకోనీ.'

'చీకటి పడుతోంది .... పద నిన్ను హాస్టల్లో దింపేస్తాను. నాకో మాట ఇవ్వు ఏ అఘాయిత్యమూ తలపెట్టనని.'

'నీ వంటివాళ్ళు నాకు అండగాఉండగా నేను పిరికిగా ఉండను. ధైర్యంగా ఎదుర్కొంటాను జీవితాన్ని.'

'దట్స్ గుడ్.'

* * *

'కెన్నై హావే కపాఫ్ కాఫీ ప్లీజ్.'

'ష్యూర్ సర్........ఒన్ మినిట్.'

మొహమంతా నవ్వు నింపుకున్న ఎయిర్‌హోస్టెస్.

(ఓహో....ఏం నడుస్తోందీ పంజాబీ పిల్ల. గో ఎహెడ్ యంగ్‌మాన్. ట్రై యువర్ లక్. కుదిరితే ఓ మహత్తరమైన అనుభవం. లేకుంటే యూహావ్ నథింగ్ టూ లూజ్. అయినా శృంగారానికి అవధులూ హద్దులూ ఎక్కడ?)

'థాంక్‌యు వెరీమచ్....వెరీ కైండ్ ఆఫ్ యూ.'

'అది మా డ్యూటీ సర్.... యూ లైకిట్?'

'ఓ....యా....సింప్లీ సుపర్బ్.'

(విమానాల్లో మీరు మా మొహాన పోసే ఈ రంగునీళ్ళకంటే మా పల్లెటూళ్ళో చూరునీళ్ళు బహు రుచిగా ఉంటాయి యూ నో....)

'మీ పేరు రఘుకదూ. ఫైట్ మానిఫెస్ట్‌లో చూశాను. ఈ రోజు చాలా విచిత్రం....ఇంతవరకూ మా జంబోల్లో ఇంత తక్కువమంది పాసెంజర్స్‌తో వెళ్తున్న మొదటి విమానం ఇదేనేమో.'

'అవునవును. తెల్లారిపోయేముందు ఆకాశంలో చుక్కల్లా అక్కడొకడూ, ఇక్కడొకడూ.'

(నీ మొహంమీద మొటిమల్లాగే)

'మీరు కవులా.'

'కాదు....ప్రేమికుణ్ణి.... ఐ మీన్ ప్రకృతిని ప్రేమించేవాణ్ణి.'

(నీలాంటి ప్రకృతిని కామించేవాణ్ణి.)

మళ్ళీ ఓ అందమైన చిరునవ్వు.

'మీ పేరు...' (సుబ్బమ్మ అయినా సరే 'బ్యూటిఫుల్' అనెయ్యడానికి రెడీగా.)

'ఒన్ మినిట్...ఆ పాసెంజర్ కేం కావాలో చూసొస్తాను.'

ఎర్రటి ఇండికేటర్ వెలిగిన వైపుకు నడుస్తున్న జఘనసుందరి వయ్యారాలు.

(ఓ గాడ్.. ఆ ముందువెనకలూ... ఆ ఎత్తుపల్లాలూ.... స్క్రూ హర్ క్విక్ యూ బ్లడీ.)

పదినిమిషాల తర్వాత.

'నాపేరు కస్తూరీ రామ్‌సింగ్.'

'నైస్ నేమ్..లైక్ యువర్‌లుక్స్.'

(ఇంతకు ముందు ఎన్నో సార్లు ఎంతోమంది అమ్మాయిలకు పరిచిన తొలి మెట్టు ఈ కాంప్లిమెంటు. ఇట్ నెవ్వర్ ఫెయిల్స్. అవునూ .... కస్తూరి .... ఎక్కడో విన్న పేరు .... ఎవరై ఉంటారు .... ఎవరు .... ఎవరు .... ఫర్‌గెటిట్..... సునీల్ గవాస్కర్‌కు తను తీసిన ప్రతి పరుగూ గుర్తుంటుందా ?)

'న్యూయార్క్‌లో ఎక్కడ మీరుండేది ?

"బ్రాంక్స్ అడ్రెసిస్తాను. ఓ సారి రండి వీలు చూసుకుని."

సాలెగూట్లోకి మెల్లమెల్లగా లాగబడుతోన్న ఇంకో అమాయక పురుగు.

* * *

నెల రోజుల తర్వాత,

తన గదిలో ఒంటరిగా కస్తూరి.... చప్పుడుతో కాలాన్ని కొలుస్తున్న గడియారం. కిటికీలో ముక్కలైన సముద్రం.

విస్తరించుకుంటున్న ఆలోచనల్లో, పోగొట్టుకున్న తనని తాను వెదుక్కుంటూ ఆమె. ప్రేమజూదంలో పణంగా పెట్టిన శీలాన్ని పోగొట్టుకుని, లేచి గదికి తాళంవేసి బయటికి నడిచింది.

భూమిని మింగుతూ అడుగులు...

సముద్రపు ఒడ్డు....వెన్నెల రహదారి వేసుకుని కూడా నీటిమీదినుంచీ రాలేని చంద్రుడు.

ఆలోచనా ప్రవంతి, మేధస్సు గట్లు తెగేటంత ఉధృతంగా. అంపశయ్య మీద ఉన్న తన ఆత్మని తనే రక్షించుకోవాలి. కానీ బాల్యంలోలాగా నిస్సహాయత. సెల్ఫ్ ఎస్టీమ్ దెబ్బతిని, ఆమెలో న్యూనతా భావాలు, నిరాశ నిస్పృహలు, స్వీయ విరాగత నుంచి బయటపడాలి. ఎలా .... తనేం చెయ్యాలి ?

ఇన్‌స్టింక్ట్స్‌కీ రీజనింగ్‌కీ ఘర్షణ. ఏది ఉచితం. ఏది కాదు ? తనతో తను సమాధానపడాలి. శరీరంనుంచీ, మనసునుంచీ అతని జ్ఞాపకాలు తొలగిపోవాలి. విలువలు వికటిస్తోన్న ఆడదా తను !

"కస్తూరీ !"

వెన్నెల్లో, వెన్నెల్లా చక్రవర్తి.

"చీకటిపడి చాలా సేపయింది. హాస్టల్‌కు వెళ్ళి, నీ గది తాళంవేసిఉంటే ఇటొస్తున్నాను" అన్నాడు కూర్చుంటూ.

'ఎందుకు చక్రీ నన్నింకా అభిమానిస్తావు.... నాలో ఏం చూసి ?

'నేను రఘులా మూర్ఖుణ్ణి కాదు. నువ్వేమిటో నాకుతెలుసు. నీ దైన్యాన్ని నేను భరించలేను. ఇన్నాళ్ళూ నువ్వు కోలుకోవాలనే ఈ విషయం ప్రస్తావించకుండా ఆగాను. ఈరోజు చెప్పెయ్యాలి నీతో.'

'నాకు తెలుసు. ఆ మాత్రం గ్రహించలేననుకున్నావా ! నన్ను పెళ్ళి చేసుకుంటాననీ, నా బిడ్డకు తండ్రిగా నిలుస్తాననీ చెప్పాలని అనుకుంటున్నావు. నామీద జాలివల్ల నేగా !'

సూటిగా ఆమె కళ్ళలోకి చూశాడతను.

'అవునూ.... కాదు .... నువ్వంటే నాకు చాలా అభిమానం. నేనెంతగానో ఇష్టపడే నువ్వు ఇంతగా బాధపడటాన్ని సహించలేకపోతున్నాను. రఘుని నీ మనసులో నుంచి తుడిచెయ్యడానికి నన్నేం చెయ్యమంటావో చెప్పు' అతని గొంతులో జాలీ, ఆవేశం.

"ఎబార్షన్ చేయించుకుంటాను. రఘులాంటి మరో వ్యక్తిని భూమ్మీదకు తెచ్చి సంఘాన్ని మరింత అవమానించలేను. పుడమితల్లి భారాన్ని మరింత పెంచలేను. నీకు చేతనైతే ఓ మంచి డాక్టరు దగ్గరకు నన్ను తీసుకెళ్ళు. తర్వాత నన్ను మర్చిపో."

'తన నడుంచుట్టూ తనకి తెలియకుండానే ఎంతోసేపటినుంచీ ఉన్న అతని చెయ్యిని తొలగిస్తూ లేచి నిలబడింది కస్తూరి, స్థిరంగా.

